

అవినీతి, అక్రమాలతో అస్తవ్యస్తంగా తయారైన జిల్లా గృహ నిర్మాణసంస్థ పాలనను గాడిలో పెట్టేందుకు కలెక్టర్ బాలాజీ కాయకల్ప చికిత్స ప్రారంభించారు. గృహ నిర్మాణ సంస్థ పీడీగా ఉన్న వెంకట్రామ్‌ను పక్కనపెట్టి, పౌరసరఫరాలశాఖ విజిలెన్స్ విభాగం జిల్లా మేనేజరుగా పనిచేస్తున్న ఎస్.పోతురాజును ఇన్‌చార్జి పీడీగా నియమించారు. ఆయన రెండు రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారులు, ఉద్యోగులపై ఎంత వరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

ఇంటి దొంగలపై చర్యల్లేవ్!

జిల్లా గృహ నిర్మాణ సంస్థలో ఇష్టారాజ్యంగా పాలన

ప్రధాన కార్యాలయంలో పేరుకుపోతున్న ఫైల్స్

- క్లియర్ చేయాలంటే చేయి తడపాల్సిందే!
- కోడూరు మండలంలో రూ.39 లక్షల అక్రమాలు జరిగినట్టు నిర్ధారణ
- ఘంటసాల మండలంలో అవినీతిపై విచారణ కోరిన ఎమ్మెల్యే బుద్ధప్రసాద్
- పెదపారుపూడి మండలంలో అక్రమాలపై నిగ్గుతేల్చినా చర్యలు శూన్యం
- పెడన పురపాలక సంఘంలో ఇళ్లు నిర్మించకుండానే బిల్లులు మంజూరు
- గృహ నిర్మాణ సంస్థ ఇన్‌చార్జి పీడీగా బాధ్యతలు చేపట్టిన పోతురాజు వీటిపై దృష్టి సారించేనా!


గృహ నిర్మాణ సంస్థ కార్యాలయం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లా గృహ నిర్మాణ సంస్థ కార్యాలయంలో ఎవరికి వారే తమదైన శైలిలో పనిచేస్తున్నారు. ఏదైనా పనులపై అధికారులు కార్యాలయానికి వస్తే సరైన సమాధానం చెప్పేవారే ఉండనిస్థితి గత కొంతకాలంగా నెలకొంది. ఉద్యోగులు, అధికారులకు సంబంధించి పీఎఫ్, పదవీ విరమణ బెనిఫిట్‌లు, ఉద్యోగుల సర్వీస్ మేటర్‌లు తదితర పరిపాలనాపరమైన అంశాలకు సంబంధించిన ఫైళ్లకు మోక్షం లభించడంలేదు. గతంలో ఇక్కడ పనిచేసి జిల్లాస్థాయి అధికారులుగా పదోన్నతి పొంది, వేరే జిల్లాల్లో పని చేస్తున్న అధికారులకు సంబంధించిన సర్వీస్ మేటర్ ఫైళ్లు కూడా కదపకుండా పోయాయని సమాచారం. ప్రతిపనికి ఒక రేటు నిర్ణయించి మరీ నగదు వసూలు చేయడం మిగతా 6లో..

ఘంటసాల మండలంలో అక్రమాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిగేనా!

గతంలో కోడూరు మండలంలో పనిచేసిన ఏఈ రెండు వేల టన్నుల ఇసుకను మాయం చేశారనే ఆరోపణలు వచ్చాయి. గృహ నిర్మాణ సంస్థ ప్రధాన కార్యాలయం విజిలెన్స్ విభాగం అధికారులు ఈ అంశంపై విచారణ చేసి రూ.39 లక్షల మేర అక్రమాలు జరిగినట్లుగా నిర్ధారించారు. ఈ ఏఈని ఆ తర్వాత ఘంటసాల మండలానికి బదిలీ చేశారు. కొడాలిలో ప్రైవేట్ గోడౌన్‌ను ఏర్పాటు చేసి సిమెంటు, ఇనుమును పక్కదారి పట్టించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఘటనపై ఫిర్యాదులు అందినా, ఆ శాఖ అధికారులు విచారణ చేయకుండా మిన్నకుండిపోయారు. ఘంటసాల మండలంలో జరిగిన అక్రమాలపై విచారణ చేయాలని, సంబంధిత ఏఈపై చర్యలు తీసుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పలుమార్లు గృహనిర్మాణశాఖ జిల్లా అధికారులకు సూచించినా, విచారణ చేయకుండా జాప్యం చేయడం గమనార్హం. పెదపారుపూడి మండలంలోని లబ్ధిదారులకు ఇవ్వాల్సిన ఇనుము, సిమెంటును ఇవ్వకుండా, గుంపగుత్తగా విక్రయించేశారు. ఈ అంశంపై ఫిర్యాదులు అందడంతో విచారణచేశారు. బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా నివేదికను పక్కనపెట్టేశారు. ఈ అంశంపైనా నూతన పీడీ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. మోపిదేవి మండలంలో పనిచేసే ఉద్యోగి ఒకరు విద్యార్హతలు లేకున్నా మండల స్థాయి అధికారిగా కొనసాగుతున్నారని, ఈ అంశంపైనా విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.

గృహ ప్రవేశాలు జరిగేనా!

ఈ ఏడాది ఆగస్టు నాటికి 3,783 గృహాలను పూర్తి చేసి శ్రావణ మాసంలో గృహ ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. అయితే ఈ లక్ష్యాన్ని చేరే అవకాశం కనిపించడంలేదు. ఇప్పటి వరకు కేవలం 428 గృహాల నిర్మాణాలను మాత్రమే పూర్తి చేశారు, కలెక్టర్ బాలాజీ ప్రతి నెలా 15 రోజులకో సారి గృహనిర్మాణ సంస్థ అధికారులతో సమీక్ష నిర్వహించి, గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని చెబుతున్నా ఫలితం ఉండటం లేదు.

కేసరపల్లికి పునర్వైభవం

ఐటీ కంపెనీల దిశగా అడుగులు

మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ ప్రారంభం

- మేధ పార్క్‌లో 25 వేల చదరపు గజాల స్థలంలో ఏర్పాటు
- హెల్త్‌కేర్, మెడికల్ కోడింగ్, మెడికల్ ఆడిటింగ్, క్లినికల్ డాక్యుమెంటేషన్ సేవలు
- ప్రస్తుతం 300 మందికి ఉపాధి.. ఏడాదిలో 1500 మందికి అవకాశం


మంత్రి లోకేశ్‌తో ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ వ్యవస్థాపకులు కార్తీక్ పాలసాని, స్నేహ పాలసాని, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తరలిపోయిన ఐటీ కంపెనీలతో ప్రాభవం కోల్పోయిన కేసరపల్లి కూటమి ప్రభుత్వం రాకతో పునర్వైభవం సంతరించుకుంటోంది. శనివారం కేసరపల్లి ఏపీఐఐసీ- ఏస్ అర్బన్ హైటెక్ సిటీలోని మేధ టవర్‌లో ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ ఐటీ కంపెనీ ఏర్పాటుతో మళ్లీ ఐటీ అభివృద్ధి వైపు అడుగులు పడుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో కేసరపల్లిలో అతి పెద్ద ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్ ఏర్పడింది. కేసరపల్లిలోని ఐటీ సెజ్‌లో ప్రధానంగా మేధ పార్క్ ఐటీ పరిశ్రమలతో నిండిపోయింది. విజయవాడలో ఐటీ కాంప్లెక్స్‌లలో కూడా ఐటీ పరిశ్రమలు వచ్చాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాయితీలు, ప్రోత్సాహకాలు ఎత్తివేయటం, ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవటంతో అన్నీ కంపెనీలు వెళ్లిపోయాయి.

మంత్రి నారా లోకేశ్ చొరవతో..

కూటమి ప్రభుత్వం వచ్చాక మళ్లీ ఇప్పుడిప్పుడే ఐటీ ఆశలు చిగురిస్తున్నాయి. మంత్రి నారా లోకేశ్ చొరవతో ఖాళీ అయిన మేధ పార్క్‌కు అతిపెద్ద ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ కంపెనీ మిగతా 6లో..

ఇంకా లభించని ఏఈఈ ఆచూకీ

మూడు రోజుల కిందట అదృశ్యమైన కిషోర్

- తనను అన్యాయంగా బదిలీ చేశారని లేఖ
- హైదరాబాద్, విశాఖలో పోలీసుల గాలింపు


ఏఈఈ కిషోర్ (ఫైల్)

తిరువూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జలవనరుల శాఖ (పీడబ్ల్యూడీ) ఏఈఈ వి.కిషోర్ ఆచూకీ ఇంకా లభించలేదు. తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖరాసి మూడు రోజుల కిందట ఆయన అదృశ్యమైన సంగతి తెలిసిందే. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రెండు బృందాలుగా పోలీసులు గాలిస్తున్నారు. ఆయన్ను వెతికేందుకు శనివారం పోలీసులు హైదరాబాద్, విశాఖపట్నం వెళ్లినట్లు సమాచారం. వివరాల ప్రకారం.. సాధారణ బదిలీల్లో భాగంగా స్థానిక జలవనరుల శాఖ ఏఈఈ వి.కిషోర్‌ను గౌరవరం ఎన్ఎస్పీ ఓఅండ్ఎం విభాగానికి బదిలీ చేశారు. గతనెల 16న ఆయన రిలీవ్ కావాల్సి ఉండగా, జలవనరుల శాఖ ఈఈ గంగయ్య, డీఈఈ ఉమాశంకర్, ఈఎన్‌సీ శ్యామ్‌ప్రసాద్ తన బదిలీని రాజయం చేశారని, స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఈఎన్‌సీకి ఫోన్‌చేసి, తనను రిలీవ్ చేయొద్దని చెప్పారని ఏఈఈ కిషోర్ తన లేఖలో పేర్కొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే కార్యాలయాల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోకపోవడంతో విరక్తి చెందానని, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ స్వయంగా మంత్రికి, ఈఎన్‌సీకి ఫోన్‌చేసినా స్పందనలేదని తెలిపారు. తనకు జరిగిన అన్యాయం మరొకరికి జరగకుండా ఉండేందుకు ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రికి లేఖ రాశారు. తన చావుకు కారణమైన జలవనరుల శాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరారు. కిషోర్ మామ ఆనందరావు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏఈఈ ఫోన్ సిగ్నల్ తెలంగాణ, ఆ తర్వాత వైజాగ్‌లో చూపించడంతో పోలీసులు అక్కడ గాలిస్తున్నారు.

కిషోర్‌ను రిలీవ్ చేసిన అధికారులు

ఏఈఈ కిషోర్‌ను తిరువూరు నుంచి రిలీవ్ చేస్తూ డీఈ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. తిరువూరుతో పాటు ఏఈ కిషోర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ప్రాంతాల నుంచి రిలీవ్ చేశారు. కంచికచర్ల స్పెషల్ సబ్ డివిజన్ ఓఅండ్ఎంగా గౌరవరానికి బదిలీ చేశారు.

ఇంత బరి తెగింపా!

ఆ వైసీపీ నేతకు అంత ధైర్యమెక్కడిది? టీడీపీ నేతలు కొమ్ము కాస్తున్నారా!

- గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు ఇక్కడ అమలు కావా?
- ఎక్స్‌కవేటర్‌లను బయటకు పంపిస్తామన్న తహసీల్దార్
- కానీ క్వారీలోనే ఉంచి శుక్రవారం రాత్రంతా ఇసుక తవ్వకాలు

ఇసుక క్వారీలపై గ్రీన్ ట్రిబ్యునల్, కలెక్టర్ ఆదేశాలు ఉన్నా వైసీపీ నేత బరి తెగించారు. రొయ్యూరు ఎస్సీ సొసైటీ భూముల్లో ఎక్స్‌కవేటర్లను పెట్టి మరీ ఇసుక, బుసక తవ్వి తరలించేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ఆ నేతకు అంత ధైర్యమెక్కడి నుంచి వచ్చింది? ఆయనకు టీడీపీ నేతలు కొమ్ము కాస్తున్నార అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. తహసీల్దార్ ఎక్స్‌కవేటర్లను క్వారీ నుంచి బయటకు పంపిస్తామని చెప్పిన తర్వాత యథేచ్ఛగా తవ్వకాలు జరపడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.


శుక్రవారం రాత్రి జరిగిన ఇసుక తవ్వకాలు


రొయ్యూరు ఎస్సీ సొసైటీ భూముల్లో శనివారం ఉన్న ఎక్స్‌కవేటర్, ఫొటో తీయటంతో దిగి వెళుతున్న ఆపరేటర్

తోట్లవల్లూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): రొయ్యూరు ఎస్సీ సొసైటీ భూముల్లో ఇసుక, బుసక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. క్వారీల వద్దకు శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' వెళ్లి తహసీల్దార్ ఎం.కుసుమకుమారిని వివరణ కోరితే, అక్కడ ఉన్న రెండు ఎక్స్‌కవేటర్‌లను బయటకు పంపిస్తామని, అవసరమైతే సీజ్ చేస్తామని చెప్పారు. కానీ ఈ రెండు ఎక్స్‌కవేటర్‌లను క్వారీల్లోనే ఉంచటంతో శుక్రవారం రాత్రంతా అక్రమ తవ్వకాలు జరిపారు. ఇక్కడ అక్రమ క్వారీలు ఏర్పాటు చేసింది ఓ వైసీపీ నేత. అతనికి ఎలాంటి అనుమతులు లేవని తహసీల్దార్ స్పష్టం చేశారు. అయినా క్వారీలు నడపటం గమనార్హం.

బలయ్యేది అధికారులే!

అక్రమ క్వారీలపై చర్యలు తీసుకోకుంటే బలయ్యేది అధికారులేనని చెప్పవచ్చు. ఎందుకంటే అధికారికంగా ఆ వైసీపీ నేత పేరుతో క్వారీ మంజూరు కాలేదు. కేవలం అధికారులు, అధికార పార్టీ నేతల అండతోనే గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను ఉల్లంఘించి అనధికార క్వారీలను ఏర్పాటు చేయటం జరిగిందంటున్నారు. ఉన్నతాధికారులు సీరియస్‌గా యాక్షన్ తీసుకుంటే స్థానిక అధికారులకే ఇబ్బంది ఎదురవుతుంది.

నిషేధం తమకు వర్తించదన్నట్టు..

అక్టోబర్ 15 వరకు ఇసుక తవ్వకాలు నిషేధిస్తూ జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలిచ్చింది. ఆ మేరకు కలెక్టర్ కిందిస్థాయి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇన్ని ఆదేశాలున్నప్పటికీ ప్రతిపక్షపార్టీకి చెందిన వ్యక్తి రెండు క్వారీలు ఏర్పాటు చేయటం బరితెగింపుగా విమర్శలు వస్తున్నాయి. అక్రమ ఇసుక తవ్వకాలు జరగకుండా తహసీల్దార్ ఆధ్వర్యంలో మండల కమిటీ పర్యవేక్షణ చేయాల్సి ఉంది. ఈ కమిటీలో ఎస్సై కూడా ఉంటారు. అధికారులే కాకుండా పోలీసులు కూడా అక్రమ ఇసుక తవ్వకాలపై నిఘా పెట్టాల్సి ఉంది. మండలంలో మిగతా 6లో..

లెక్చరర్ పోస్టులకు నేటి నుంచి పరీక్షలు

నాలుగు రోజుల పాటు నిర్వహణ

- జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 1,813 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లపై అధికారులకు డీఆర్‌వో దిశానిర్దేశం

మచిలీపట్నం టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల్లో లెక్చరర్స్ పోస్టుల భర్తీకి కంప్యూటర్ ఆధారిత పరీక్షలు ఆదివారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్నారు. పెనమలూరు మండలంలోని కానూరు గ్రామంలో అయాన్ డిజిటల్ జోన్, ప్రసాద్ వి పొట్లూరి సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గంగూరులోని ధనేకుల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మచిలీపట్నంలోని డీఎంఎస్ఎస్‌వీహెచ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ సెషన్ల వారీగా పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 1,813 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణపై అధికారులతో జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు శనివారం సమావేశం నిర్వహించారు. పరీక్షా కేంద్రాలకు సమీపంలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. తాగునీటి వసతి, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్లు ఆరోగ్యరాణి, విజయలక్ష్మి, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై కిషోర్ తదితరులు పాల్గొన్నారు.


మచిలీపట్నంలో సైకిల్‌పై తిరుగుతూ పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ

ప్లాస్టిక్‌ను వీడితేనే భావితరాల మనగడ

- కలెక్టర్ డీకే బాలాజీ 6

దుర్గగుడిలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- ఈవో శీనా నాయక్


భక్తులతో మాట్లాడుతున్న ఈవో శీనా నాయక్

పీ-4 మార్గదర్శకురాలిగా పారిశుధ్య కార్మికురాలు

- వృద్ధురాలిని దత్తత తీసుకున్న హేమలత 6



బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం

- ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఫలించని దాతల ఔదార్యం!

కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతూ లాస్య మృతి


పూర్ణాహుతి నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు

పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు

మోపిదేవి, జూలై 19(ఆంధ్రజ్యోతి): మోపిదేవిలోని శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవ సహిత ఆషాడ కృత్తిక మహోత్సవాలు శనివారం మహా పూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం స్వామివారికి గోపూజ, సుప్రభాత సేవ, నిత్యార్చన సుబ్రహ్మణ్య మూలమంత్ర అనుష్ఠానం, హవనం, పవిత్ర జలసంప్రోక్షణ నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొనగా, ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో అర్చక బృందం మహా పూర్ణాహుతి కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిపింది.



గొల్లపూడి ఏఎంసీ చైర్మన్ నర్రా వాసును శాలువాతో సత్కరిస్తున్న ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

రైతుల సంక్షేమమే లక్ష్యం : ఎంపీ కేశినేని చిన్ని

గొల్లపూడి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. గొల్లపూడి వ్యవసాయ మార్కెట్‌లో శనివారం ఏఎంసీ పాలక వర్గ సమావేశం జరిగింది. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఏఎంసీ చైర్మన్ నర్రా వాసును ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్, కాలుష్యాన్ని నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎంపీ చిన్ని మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ లక్ష్యాల మేరకు సమర్థంగా బాధ్యతలు నిర్వర్తించి రైతులకు విశేషంగా సేవలు అందించాలన్నారు. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నర్రా వాసు మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

డీసీ చైర్మన్ చొరవ..బండిరేవుకోడు పూడికతీత



బండిరేవుకోడులో చెత్తను తొలగిస్తున్న డీసీ చైర్మన్ దిలీప్‌కుమార్

చల్లపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : డీసీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత నిడమానూరి దిలీప్‌కుమార్ స్వయంగా కూలీ అవతారమెత్తి మురుగు కాల్వ పూడికతీత పనుల్లో పాల్గొన్నారు. పడమరవీధిలోని బండిరేవుకోడులో తూముల వద్ద చెత్తా చెదారం, గుర్రపుడెక్క అడ్డుపడి మురుగు పారుదల జరగటం లేదు. ఎగువ ప్రాంతాల పొలాల నుంచి వచ్చే మురుగు బ్రహ్మం గారి దేవాలయం సమీపంలో వంతెన తూముల్లో నుంచి వెళ్లడం లేదు. మందులు పిచికారీ చేయగా, మాడిపోయిన గుర్రపుడెక్క తూములకు అడ్డుపడింది. దీంతో వ్యర్థాల పూడికతీత కోసం దిలీప్‌కుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. రైతులెవరూ అందుబాటులో లేకపోవడం, ఎక్స్‌కవేటర్‌కు చెత్త అందకపోవటంతో దిలీప్‌కుమార్ డ్రెయిన్‌లోకి దిగి కర్ర సహాయంతో కొంతమేర చెత్తను తీసుకొచ్చి, తొలగించారు. సమస్యపై స్పందించి పనులు చేయించటంతోపాటు స్వయంగా తానే శ్రమదానం చేయటం పట్ల రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ డీసీ చైర్మన్ దిలీప్‌ను అభినందించారు.



జిల్లా స్థాయి యోగా పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్

యోగాలో కృష్ణాను అగ్రగామిగా నిలపాలి

ఉయ్యూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : యోగాలో కృష్ణాజిల్లాను జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలపాలని యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ అన్నారు. గండిగుంట దత్తాశ్రమంలో శనివారం యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ అవనిగడ్డ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యోగా పోటీలను గొట్టిపాటి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. నాగార్జున విశ్వవిద్యాలయంలో యోగా కోర్సు నిర్వహిస్తున్నారని, కృష్ణా విశ్వవిద్యాలయంలో యోగా కోర్సు ప్రారంభించేందుకు ఉపకులపతి ముందుకు రావడం ముదావహమని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.రాధిక అన్నారు. జిల్లా అధ్యక్షుడు జి.కృష్ణ మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో 130 మంది పాల్గొనడం విశేషమన్నారు. నూకల సాంబశివరావు, సుధాకర్, తేజ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఉయ్యూరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రవీణ్, పాలకవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం

● ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన, మైనార్టీలకు సముచిత స్థానం కల్పించేది టీడీపీ మాత్రమే అని వక్తలు పేర్కొన్నారు. ఉయ్యూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో శనివారం పాలకవర్గ ప్రమాణస్వీకారం జరిగింది. టీడీపీ, జనసేన, కూటమి నాయకులు పాల్గొని ప్రసంగించారు. చైర్‌పర్సన్‌గా కొండా ప్రవీణ్, వైస్ చైర్మన్‌గా జరుగు ఆదినారాయణ, డైరెక్టర్లుగా బాణావతు రాఘవేంద్రరావు, బి.జయరాజు, దోనేపూడి శివాజీ, డి.సముద్రవేణి, జి.వెంకటేశ్వరరావు, గొరిపర్తి లక్ష్మీదేవి, జి.సౌజన్య, ఎం.సుజాత, షేక్ జలీల్, టి.కుమారి, కె.తేజస్వి, పి.శ్రీనివాసరావు, టి.విజయకుమారితో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రమాణ స్వీ కారం చేయించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, నియోజకవర్గ పరి శీలకుడు రాంబాబు, గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్, వి.సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు కుటుంబరావు, రాజేశ్, బోడె వెంకటరామ్ తదితరులు పాల్గొన్నారు. ర్యాలీగా నాయకులు ప్రమాణ స్వీకారానికి తరలివచ్చారు.

ఇంటి దొంగలపై చర్యల్లేవ్!

(5వ పేజీ తరువాయి)

ఇక్కడ రివాజుగా మారిందనే ఆరోపణలు కూడా ఉన్నాయి. గోడౌన్ ఇన్‌చార్జిగా పనిచేసే ఉద్యోగికి ఎలాంటి అర్హతలు లేకున్నా జిల్లా కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టును కట్టబెట్టారు. ఈ ఉద్యోగి తనదైన శైలిలో ఉద్యోగులు, అధికారులకు సంబంధించి సర్వీస్ మేటర్ ఫైళ్లను త్వరితగతిన పంపకుండా ఆటలాడుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఉద్యోగి పనితీరుపై అధికారులు, సిబ్బంది పలుమార్లు ఫిర్యాదులు చేసి నా, ఎవ్వరూ పట్టించుకోవడంలేదు. ఇన్‌చార్జి పీడీ అయినా ఈ ఉద్యోగి పని తీరుపై నిఘా పెట్టాలని గృహనిర్మాణ సంస్థ ఉద్యోగులంతా కోరుతున్నారు.

ఇళ్లు నిర్మాణం చేయకుండానే బిల్లులు

పెడన పురపాలక సంఘంలోని పైడమ్మ కాలనీలో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో గృహాల నిర్మాణం ప్రారంభించకుండానే బిల్లులు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధి, సచివాలయ సెక్రటరీ కూడబలుక్కుని పునాదుల దశ దాటని, పునాదుల దశలో ఉన్న గృహాలకు శ్లాబు దశల వరకు చేరుకున్నట్లుగా చూపి ముందస్తుగానే బిల్లులు కాజేశారు. ఇలా 100కుపైగా గృహాలకు బిల్లులు చేసినట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. పనులు చేయకుండానే బిల్లులు చేసిన గత అధికారులు, సిబ్బందిపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా సాచివేత ధోరణితో వ్యవహరిస్తున్నారు.



పారిశుధ్య పనులను పరిశీలించిన అనంతరం పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న కలెక్టర్ బాలాజీ, కమిషనర్ బాపిరాజు



గుడివాడ మున్సిపల్ కార్యాలయంలో ప్లాస్టిక్ రహిత వస్తువుల ప్రదర్శనను తిలకిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే వెనిగండ్ల

ప్లాస్టిక్‌ను వీడితేనే భావితరాల మనుగడ

● కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

మచిలీపట్నం టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్‌ను దూరం చేసి, కాలుష్య నివారణకు నడుం బిగించాలని కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. కలెక్టరేట్, బ్రహ్మపురం తదితర ప్రాంతాల్లో శనివారం ఆయన సైకిల్‌పై పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించిందన్నారు. భావితరాల మనుగడకు పర్యావరణానికి హాని కలిగే ప్లాస్టిక్‌ను వీడి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పారిశుధ్య కార్మికులను ఆయన ఘనంగా సన్మానించారు. నగర కమిషనర్ బాపిరాజు, మునిసిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కాగిత, నార వస్తువుల వాడకం పెంచాలి

గుడివాడ : ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకం నివారించి మానవాళి మనుగడకు తోడ్పడాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. గుడివాడ పురపాలక సంఘ ప్రాంగణంలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలిసి ఆయన పాల్గొన్నారు. ప్లాస్టిక్ కవర్ల వాడకంతో క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన ప్రజలు పడుతున్నారన్నారు. ఆహార అవసరాలకు ఆకులతో తయారు చేసిన ప్లేట్లు, సహజసిద్ధమైన వస్తువులను వాడాలన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగంతో ప్రజలు ఆరోగ్య సమస్యలను కొనితెచ్చుకుంటున్నారన్నారు. ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలను ప్రతి ఒక్కరూ గుర్తించి జూట్ సంచులు, స్టీల్, పింగాణి వంటి పాత్రలను వాడాలన్నారు. కాగితపు గ్లాసులు, చెక్కచెంచాలు, ఆకు పళ్లాలు, స్టీల్ గ్లాసులు, గుడ్డ సంచులు తదితర వస్తువులతో ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలను కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే వెనిగండ్ల పరిశీలించారు. ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు జగన్మోహనరావు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

● ఈవో శీనా నాయక్

ఇంద్రకీలాద్రి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : కనకదుర్గమ్మ సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం చేపడుతున్న అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించాలని, గడువుకు ముందే నిర్మాణాలు పూర్తి అయ్యేలా పని చేయాలని ఈవో వి.కె. శీనా నాయక్ ఆదేశించారు. కొండ మీద అన్ని పూజలు ఒకే ప్రాంగణంలో జరిగేలా నిర్మిస్తున్న పూజా మంటపం భవనం, సువిశాల యాగశాలలను శనివారం పరిశీలించి ఇంజనీరింగ్ సిబ్బంది, కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. శ్రావణ మాసం ఆరంభంలోపే నిర్మాణాలు పూర్తి అయితే భక్తులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. పూజా మంటపం పైన అంతస్తు పరిశీలన చేశారు. మహామంటపం క్యూలో మంచినీటి సరఫరా, మరుగుదొడ్లు, మౌ లిక సదుపాయాలు పర్యవేక్షణ చేసి, పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బందికి సూచనలు చేశారు. మహామంటపం ప్రతి ఫ్లోర్‌ను సిబ్బంది పర్యవేక్షిం చాలని, పరిశుభ్రత మెరుగుపడాలని సూచించారు. భక్తులకు అన్న ప్రసాదం అందుబాటులో ఉందని తెలిసేలా మైక్ ప్రచారం చేయాలని, దీనికి తగ్గట్లు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. అన్నప్రసాదం హాల్ పరిశీలించి భక్తులతో మాట్లాడారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అశోక్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పూజామంటపం, యాగశాల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఈవో శీనా నాయక్



అన్నప్రసాదం తీసుకుంటున్న భక్తులతో మాట్లాడుతున్న ఈవో శీనా నాయక్

ఆగస్టులో పవిత్రోత్సవాలు, వరలక్ష్మీవ్రతం

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఆగస్టు నెలలో జరిగే ఉత్సవాల షెడ్యూల్‌ను ఈవో శీనా నాయక్ శనివారం ప్రకటించారు. పవిత్రోత్సవాలను ఆగస్టు 7, 8, 9, 10 తేదీల్లో నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 8వ తేదీన కనకదుర్గమ్మ వరలక్ష్మీదేవిగా దర్శనం ఇస్తారన్నారు. ఆగస్టు 22వ తేదీన (5వ శ్రావణ శుక్రవారం రోజు) మహామండపం ఆరో అంతస్తులో ఉదయం 7గంటల నుంచి 9 గంటల వరకు ఆర్జిత సేవలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి 11.30 గంటల వరకు ఉచిత వరలక్ష్మీ వ్రతాలను నిర్వహిస్తారు. ఉచిత సామూహిక వరలక్ష్మీవ్రతాల్లో పాల్గొనే భక్తులు కార్యాలయ పనివేళల్లో దేవస్థానం టోల్‌ఫ్రీ కౌంటర్ నందు ఆగస్టు 18వ తేదీన దరఖాస్తులు పొందాల్సి ఉంటుందన్నారు. ఆర్జిత వరలక్ష్మీ వ్రత సేవ భక్తులు ఒకరికి రూ.1500 రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఆగస్టు 16వ తేదీ కృష్ణాష్టమి సందర్భంగా ఆశీర్వచన మండపంలో ఉదయం 8 గంటలకు శ్రీకృష్ణభగవానుడికి పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. సాయంత్రం 5 నుంచి 6 గంటలకు దేవస్థానం పురాణ పండితులు కృష్ణాష్టమి ప్రాధాన్యతను వివరించారు. సాయంత్రం 6.10 గంటలకు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.



లాస్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దంపతులు

ఫలించని దాతల ఔదార్యం!

కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతూ లాస్య మృతి

అవనిగడ్డ రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : అవనిగడ్డ మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు గాజుల మురళీకృష్ణ కుమార్తె లాస్య (21) శనివారం తెల్లవారుజామున విజయవాడలో మృతి చెందింది. అవనిగడ్డ ఎస్‌వీఎల్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివిన లాస్య ఆ తదుపరి అదే కళాశాలలో డిగ్రీలో చేరింది. లాస్య కిడ్నీ వ్యాధితో బాధపడుతుండటంతో సహచర విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి రూ.8 లక్షలకుపైగా ఆర్థిక సహాయాన్ని అందించారు. మరి కొందరు దాతలతోపాటు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో లాస్య కుటుంబానికి సాయం అందించారు. చికిత్స పొందుతూ లాస్య శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. లాస్య భౌతిక కాయాన్ని స్వగ్రామమైన గాజులవారిపాలెం గ్రామానికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులతో తోపాటు మండల టీడీపీ అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్, జనసేన పార్టీ నాయకులు గుడివాక శివరావు, పలువురు ప్రముఖులు లాస్య భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అశ్వారావుపాలెంలో రేపల్లె శేషుకుమారి మృతి చెందగా, ఆమె భర్త మాజీ సర్పంచ్ రేపల్లె వీర రాఘవయ్య, కుమారుడు మాజీ సర్పం చ్ రేపల్లె బసవ పున్నయ్య(వాసు)లను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

సాగునీటి రంగంపై సమగ్ర ప్రణాళిక

● ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్‌ను అభినందిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

నందిగామ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ప్రణాళికతో జిల్లాలోని పూర్తిస్థాయి సాగుభూమికి నీ టిని అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చే స్తోందని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. శ నివారం వేదాద్రి ఎత్తిపోతల పథకం వద్ద విలేకరులతో మాట్లాడిన ఎంపీ కేశినేని సాగునీటి రంగంపై సీ ఎం చంద్రబాబు నిర్దిష్ట ప్రణాళికతో ముందుకు సా గుతున్నారన్నారు. జిల్లాలోని పూర్తి సాగుభూమికి నీ రందించే ప్రణాళికలు ఉన్నట్టు చెప్పారు. వేదాద్రి వద్ద 430 కోట్లతో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు తాగు, సాగునీటి అవసరాలు తీర్చేందుకు భారీ పథకం నిర్మిస్తోందని జీవో ప్రతులను చూపించారు. ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకమైన మెగా ఇంజనీరింగ్ కంపెనీకి అప్పగించినట్టు తెలిపారు. జిల్లాలోని అన్ని ఎత్తిపోతల పథకాలను హామ్ (హైబ్రీడ్ ఎన్‌యూటీ మోడల్) విధానంలో నిర్వహణ ప్రభుత్వమే చేపట్టనుందన్నారు. ఇందుకోసం రూ.5200 కోట్లు కే టాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వైకుంఠపురం వద్ద బ్యారేజ్ నిర్మాణం చేపట్టి బ్యాక్ వాటర్‌ను జిల్లాలోని పంట పొలాలకు మళ్లించనున్న ట్టు తెలిపారు. జిల్లాలోని అన్ని ఎత్తిపోతల పథకాలకూ త్వరలోనే మరమ్మతులు చేపట్టి ఆయకట్టును స్థి రీకరిస్తామన్నారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్, ఐడీసీ చైర్మన్ లీలాకృష్ణ, ఐడీసీ ఎండీ తిరుమలరావు, ఈఈ చిన్నయ్యరెడ్డి, ఎన్ఎస్‌పీ ఎస్ఈ మెహిద్దీన్, ఈఈ కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

శభాష్ చంద్రశేఖర్

వేదాద్రి ఎత్తిపోతల పథకం మరమ్మతుల కోసం అహర్నిశలూ శ్రమించిన నందిగామ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ రాటకొండ చంద్రశేఖర్‌ను ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అభినందించారు. పక్షం రోజులుగా సొంత నిధులతో పథకం మరమ్మతులు చేయిస్తూ అన్నదాతలకు సాగునీరందించేందుకు చంద్రశేఖర్ పడిన ఆరాటాన్ని ఆయన ప్రశంసించారు. రోజువారీ అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకున్న ఎంపీ మాట్లాడుతూ చంద్రశేఖర్ పడిన కష్టానికి త్వరలో ఫలితం వస్తుందని, రైతులకు అండగా ఉండాలన్న చంద్రశేఖర్ కృషి అభినందనీయమన్నారు. ఎంపీ అభినందనలతో పాటు అక్కడున్న రైతులంతా చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంత బరి తెగింపా!

(5వ పేజీ తరువాయి)

ఇటు రెవెన్యూ అధికారులు, అటు పోలీసులు గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను ఆవగింజంత కూడా పట్టించుకోవటం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రొయ్యూరు ఎస్సీ సొసైటీలో నడుస్తున్న రెండు క్వారీలే అధికారుల వైఫల్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. శనివారం 'ఆంధ్రజ్యోతి'లో అర్ధరాత్రి తవ్వకాలు శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ వార్త వచ్చాక కూడా అధికారుల్లో ఏ మాత్రం చలనం లేకుండా ఉందంటే ఇసుక, బుసక మాఫియా ఎంత బలంగా ఉందో అర్థం అవుతోంది. శనివారం సాయంత్రం 5 గంటలకు రొయ్యూరు ఎస్సీ సొసైటీ భూముల్లో క్వారీల వద్దకు 'ఆంధ్రజ్యోతి' వెళ్లగా ఒక ఎక్స్‌కవేటర్ క్వారీలో ఇసుక ఎంత లోతున ఉందో తవ్వుతోంది. ఫొటో తీయటంతో ఎక్స్‌కవేటర్ ఆపరేటర్ దిగి వెళ్లిపోయాడు. మరో ఎక్స్‌కవేటర్ పొదల మాటునే ఉంది. క్వారీల్లో పరిశీలిస్తే శుక్రవారం రాత్రి భారీగా ఇసుక తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు ఉన్నాయి.

తెర వెనుక టీడీపీ నేతలు!

తోట్లవల్లూరు చెందిన వైసీపీ నేతకు టీడీపీ నేతలు కొమ్ము కాస్తున్నారనే ఆరోపణలున్నాయి. క్వారీ బాట నిర్మించే సమయంలో టీడీపీ కార్యకర్తలు అతనికి అండగా నిలవటం ఈ ఆరోపణలకు బలం చేకూరుతోంది. అంతేకాక ఓ ఐఏఎస్ అధికారి ఇతని క్వారీలకు అండగా నిలిచారనే ప్రచారం జరుగుతోంది.

వీఆర్వో, ఇద్దరు పోలీసులను పెట్టాం : తహసీల్దార్

రొయ్యూరు ఎస్సీ సొసైటీ భూముల్లో ఇసుక తవ్వకాలు ఆగని విషయమై శనివారం తహసీల్దార్ ఎం.కుసుమకుమారిని వివరణ కోరగా, శుక్రవారం రాత్రి వీఆర్వో, ఇద్దరు పోలీసులను కాపలా పెట్టామని చెప్పారు. మిషన్‌లను సీజ్ చేయకుండా వీఆర్వోని, పోలీసులను కాపలా పెట్టామని చెప్పటం హాస్యాస్పదంగా మారింది.

కేసరపల్లికి పునర్వైభవం

(5వ పేజీ తరువాయి)

వచ్చింది. కంపెనీ ఏర్పాటుతోనే 300 మందికి ఉద్యోగావకాశాలను కల్పించింది. ఏడాదిలో మరో 1500 ఉద్యోగాలను కల్పించనున్నట్లు ఆ సంస్థ ప్రకటించింది. ఎక్లాట్ సంస్థ అమెరికా కేంద్రంగా విస్తృత సేవలు అందిస్తోంది. వర్జీనియాలో దీని కార్యాలయం ఉంది. అమెరికాలో ఉన్నప్పటికీ ఈ కంపెనీ వ్యవస్థాపకులు మన తెలుగువారే కావటం గమనార్హం. కార్తీక్ పొలసాని, స్నేహ పొలసానిలు ఈ కంపెనీని నిర్వహిస్తున్నారు. కేవలం 11 మందితో ఏర్పడిన ఈ సంస్థ ఇప్పుడు 3,500 మంది వృత్తి నైపుణ్యం కలిగిన నిపుణులతో ముందుకు సాగుతోంది. ఈ ఏడాది మరో రెండు వేల మంది సామర్థ్యంతో విస్తరించాలని కంపెనీ యాజమాన్యం భావిస్తోంది. ఈ సంస్థ అమెరికా కేంద్రంగా ఉన్నప్పటికీ పిలిప్పైన్స్, మన దేశంలో హైదరాబాద్, కరీంనగర్, లక్నో, ముంబయి తదితర ప్రాంతాలలో తన శాఖలను విస్తరించింది. ఐటీ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుండటంతో విజయవాడలో తమ సంస్థను ప్రారంభించాలని నిర్ణయించింది. తమ సంస్థను విస్తరించాలన్న క్రమంలో బెజవాడ వంటి టూ టైర్ సిటీని కంపెనీ యాజమాన్యం ఎంచుకుంది. కేసరపల్లి మేధ టవర్‌లో సేవలను ప్రారంభించాలనుకుంది. మొత్తం 25 వేల చదరపు గజాల విస్తీర్ణంతో కూడుకున్న ప్రాంగణంలో ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ కంపెనీ ఏర్పడింది. అంతర్జాతీయ స్థాయిలో ఐటీ ఆధారిత హెల్త్‌కేర్, మెడికల్ కోడింగ్, మెడికల్ ఆడిటింగ్, క్లినికల్ డాక్యుమెంటేషన్, క్లినికల్ ఇంప్రూవ్‌మెంట్, రిస్క్ అడ్జస్టింగ్, ఆర్సీఎం సర్వీస్, సాస్ బేస్డ్ టెక్నాలజీ, రెవెన్యూ సైకిల్, బిజినెస్ ప్రాసెస్ వంటి సేవలను అందించనుంది.

ఎక్లాట్ బెజవాడకు గర్వకారణం : నారా లోకేశ్

ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్ ఏర్పాటు చేయటం బెజవాడకు గర్వకారణమని మంత్రి నారా లోకేశ్ అన్నారు. అంతర్జాతీయ ఐటీ రంగంలో ఏపీ ఎదుగుతున్న తీరుకు ఇది నిదర్శనమన్నారు. సంస్థ వ్యవస్థాపకులు కార్తీక్,స్నేహకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఏపీలో ప్రతి నగరం డిజిటల్ గ్రోత్ ఇంజన్‌లుగా ఎదగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. సీఎం చంద్రబాబు బ్రాండ్ వల్లే ఏపీకి కంపెనీలు వస్తున్నాయన్నారు.

యువగళంలో ఇచ్చిన హామీ మేరకు..

ప్రభుత్వ విప్, గన్నవరం శాసన సభ్యులు యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాల కల్పనలో భాగంగా ఈ రోజు ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్‌లో 300 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు.తన నియోజకవర్గంలోనే ఎక్కడా లేనివిధంగా మల్లవల్లి, వీరపనేనిగూడెంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఉన్నాయన్నారు. మరో రెండు ఎంఎస్ఎంఈలను ఇవ్వాలని మంత్రి లోకేశ్‌ను కోరారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో ఏర్పాటు చేసిన అశోక్ లేలాండ్ యూనిట్ ద్వారా 600 మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభించాయని, మరో సంవత్సరంలో 1200 మందికి అవకాశాలు లభిస్తాయన్నారు. మంత్రి లోకేశ్ విద్యాశాఖలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. ఇటీవల చాలామంది మహిళలను అసభ్య పదజాలంతో తెలుగు భాషను కించపరిచే విధంగా మాట్లాడుతున్నారని, వచ్చే వర్షాకాల శాసనసభ సమావేశాల్లో తెలుగు భాషను కించపరిస్తే చర్యలు తీసుకునే విధంగా ఒక బిల్లు ప్రవేశపెట్టాలని లోకేశ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ సంస్థ వ్యవస్థాపకులు కార్తీక్ పొలసాని,స్నేహ పొలసాని, కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ ఆర్.గంగాధరరావు, పామర్రు శాసన సభ్యులు వర్ల కుమార్ రాజా, ఎక్లాట్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ గుర్రం, మోహిత్ శ్రీవాస్తవ, విజయవాడ బ్రాంచ్ డీజీఎం సురేష్ రెడ్డి, గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, డీఐసీజీఎం వెంకటరావు, ఏపీఐఐసీ డిప్యూటీ జీఎం దివస్, గన్నవరం తహసీల్దార్ శివయ్య తదితరులు పాల్గొన్నారు.



వృద్ధురాలికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న హేమలత

పీ-4 మార్గదర్శకురాలిగా పారిశుధ్య కార్మికురాలు

● వృద్ధురాలిని దత్తత తీసుకున్న హేమలత

చల్లపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 పథకంలో మార్గదర్శకురాలిగా భాగస్వామ్యం కావటానికి పారిశుధ్య కార్మికురాలు ముందుకువచ్చింది. పురిటిగడ్డ ప్రాథమిక పాఠశాలలో ఆయాగా పనిచేస్తున్న పల్లికొండ హేమలత పీ-4 యాప్‌లో మార్గదర్శకురాలిగా పేరును నమోదు చేసుకుని పురిటిగడ్డ దళితవాడకు చెందిన చర్ల కనికరం అనే వృద్ధురాలిని దత్తత తీసుకుంది. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు చేతుల మీదుగా వృద్ధురాలికి సరుకులను అందించింది. హేమలత సేవాభావాన్ని సురేష్‌బాబు అభినందించారు. సాటి వారికి సాయం అందించడానికి ధనవంతులే అవసరం లేదని, సేవ చేయాలనే సంకల్పం ఉంటే ఎవరైనా చేయొచ్చని హేమలత తెలిపారు.

ప్రాసిక్యూషన్ మరింత బలపడాలి

● డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు

విజయవాడ లీగల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రాసిక్యూషన్ విభాగం, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ సంయుక్తంగా నిర్వహించిన 'మనుషుల అక్రమ రవాణా, నిర్బంధ కార్మిక వ్యవస్థ నిరోధక చట్టం, 1976పై ప్రత్యేక శిక్షణ విజయవంతంగా ముగిసింది. గవర్నర్‌పేటలోని ఇరిగేషన్ హాలులో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 100 మంది ప్రాసిక్యూటర్లు ఈ పాల్గొన్నారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు మాట్లాడుతూ 'బాధితుడి న్యాయ హక్కులకు కవచంలా నిలిచే బలమైన వ్యవస్థగా ప్రాసిక్యూషన్ ఏర్పడాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ స్టేట్ ప్రోగ్రాం డైరెక్టర్ క్లైమెండ్ డేవిడ్, జీవన్‌జ్వాలా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.తేన్‌మొళి, కృష్ణా, గుంటూరు, పశ్చిమ గోదావరి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్స్ ఎంకే విజయలక్ష్మి, బర్కత్ అలీఖాన్, నక్క శారదామణి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	115, 123, 134
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 520

సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి



హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సహకార వ్యవస్థను బలోపేతం చేసేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎన్ఎస్ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు అన్నారు. రంగన్నగూడెం నేతాజీ పీఏసీఎస్ నూతన కమిటీ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ కనకవల్లి శేషగిరిరావు, డైరెక్టర్లు సముద్రాల వరప్రసాద్, గండి శ్రీనివాసరావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, పుసులూరి లక్ష్మీనారాయణ, బెజవాడ కృష్ణారావు, తుమ్మల దశరధరామయ్య, అవినాష్, సుధారాణి, కార్యదర్శి వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకానికి స్వస్తి పలకాలి

స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు.. ఉషారామ విద్యార్థుల ర్యాలీ

గన్నవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వాడకానికి ప్రతి ఒక్కరూ స్వస్తి పలకాలని, స్వచ్ఛ గన్నవరం కోసం ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, మేధావులు కృషి చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అధికారులతో కలిసి శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నా రు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, టీడీపీ నాయకులు దొంతు చిన్న, గూడపాటి తులసిమోహన్, బోడపాటి రవి కుమార్, జాస్తి శ్రీధర్, బుస్సే నాగప్రసాద్, మేడేపల్లి రమ, అన్నే హరికృష్ణ, తులిమెల్లి రూన్సీరాణి, కాసర్నేని రంగబాబు తదితరులు పాల్గొన్నారు. ● పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్‌ను నిర్మూ లించాలని సర్పంచ్ ఈల ప్రోలు వాసు అన్నారు. మండలంలోని సూరంపల్లిలో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర ర్యాలీని నిర్వహించారు. కిరాణా షాపులకు వెళ్లి ప్లాస్టిక్ కవర్లు వినియోగించవద్దని అవగాహన కల్పించా రు. జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులు స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు. హెచ్ఎం హరిశరణ్, ఉపాధ్యాయులు కె.మధుసూదనరావు, శ్రీనివాసరావు, నాయక్, శాంతి కిరణ్ పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వినియోగించకుండా సహకరించాలని బాపులపాడు మండల డిప్యూటీ ఎంపీడీవో కె.లక్ష్మయ్య వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తూ శనివారం బాపులపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి సంపూర్ణేశ్వరి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది దుకాణాల యజమానులకు నోటీసులు జారీ చేశారు. గ్రామంలోని 400 దుకాణాలకు నోటీసులు జారీ చేశారు. ●గ్రామంలో ప్రజలకు పౌరసేవల్లో భాగంగా జనన, మరణ ధ్రువ పత్రాలు, సీనియర్ సిటీజన్స్ ఐడీ కార్డులకు ఎటువంటి రుసుం వసూలు చేయకుండ ఉచితంగా అందిస్తున్నట్లు బాపులపాడు పంచాయతీ కార్యదర్శి సంపూర్ణేశ్వరి శనివారం ప్రకటనలో తెలిపారు.

ఉంగుటూరు : ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ అన్నారు. మండల వ్యాప్తంగా పలు పాఠశాలలు, కళాశాలల్లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు పొట్టిపాడులో అవగాహనా ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ వినియోగం-కలిగే అనర్థాలపై ప్రజలకు వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరిబాబు పాల్గొన్నారు.

● పాలిథిన్ కవర్లు, క్యారీబ్యాగ్‌లు, ప్లాస్టిక్ బాటిళ్లు, గ్లాసులు, కప్పుల స్థానంలో పేపర్, క్లాత్, జ్యూట్ వస్తువులను వినియోగించడం ద్వారా ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించాలని ఎంఈవో జె.సాంబశివరావు సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నివారణపై ఉంగుటూరు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించారు. ఈవోపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, సర్పంచ్ ప్రసాద్, హెచ్ఎం సీహెచ్ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని గ్రామపెద్దలు వేగే సూర్యనారాయణ అన్నారు. పెదఅవుటపల్లి జడ్పీహైస్కూల్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మొక్కల ప్రాధాన్యత గురించి ప్రజలకు వివరిస్తూ గ్రామ ప్రధాన వీధుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం కే.శేషుకుమారి, పీడీ జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కానూరు : తాడిగడప మున్సిపల్ పరిధి కానూరు గ్రామం కామయ్యతోపులో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం భారీ ర్యాలీ జరిగింది. కామయ్యతోపు నాలుగురోడ్ల కూడలి నుంచి ప్రారంభమైన ర్యాలీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల వరకు సాగి తిరిగి నాలుగు రోడ్ల కూడలికి చేరింది. ఈర్యాలీని మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ జండా ఊపి ప్రారంభించారు. ప్లాస్టిక్ వినియోగించమని, పర్యావరణ కాపా డతామని కోరుతూ స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కిరణ్‌కుమార్ తోపాటు శానిటరీ మేస్త్రులు, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.

● పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సంకల్పానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలి జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. కానూరు జెడ్‌పీ హైస్కూల్‌లో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర... స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెత్తను డస్ట్‌బిన్‌లోనే వేయాలని, ప్లాస్టిక్ వాడొద్దని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన నేత దివి మహేష్, వెంకటేశ్వర రావు, రాజేష్, ఏడుకొండలు, వెంకన్నతోపాటు ఆశ వర్కర్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉయ్యూరు : పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా అనారోగ్యం బారిన పడకుండా జీవించవచ్చని ఎంపీడీవో శేషగిరిరావు, అసిస్టెంట్ ఎంపీడీవో కోటేశ్వరరావు అన్నారు. ఈ నెల మూడో శనివారం పురస్కరించుకుని స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల పరిధి గ్రామ పంచాయతీల్లో ప్లాస్టిక్ నిషేధం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం, ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలు తెలియజేస్తూ పెదఓగిరాలలో పాఠశాల విద్యార్థులు ప్రదర్శన చేశారు. పాలి థిన్ కవర్ల వినియోగం మానుకుని గుడ్డ సంచులు వాడాలన్నారు. పంచా యతీ కార్యదర్శి కృపాకుమార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

స్కాట్‌స్పైన్ స్కూల్‌లో బ్యాడ్జీల ప్రదానోత్సవం

కానూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కానూరులోని స్కాట్‌స్పైన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో విద్యార్థులతో ఎన్నికైన స్టూడెంట్స్ కౌన్సిల్ లీడర్స్‌కు శనివారం బ్యాడ్జీల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐఏఎస్ అధికారి హిమాన్షు శుక్ల విచ్చేసి స్టూడెంట్స్ కౌన్సిల్ లీడర్‌లకు బ్యాడ్జీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చిన్ననాటి నుంచి నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేఆర్ శేషాద్రిరావు, వీరమాచనేని వంశీ, శాంతి, జాహ్నవి, ప్రతిమా పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

176 మందికి వైద్య పరీక్షలు



గన్నవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పాత గన్నవరంలోని లక్ష్మీ తిరుపతమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. క్యాన్సర్, కళ్లు, దంత పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో 176 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సీతారాంబాబు, చిమట శ్రీనివాసరావు, మోదుగుమూడి వేణుగోపాలరావు, కాసన్నేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంపై అవగాహన సదస్సు 22న

హనుమాన్‌జంక్షన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగ దారుల సమస్యలపై విజయవాడ కన్స్యూమర్స్ గ్రీవెన్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 22న హనుమాన్‌జంక్షన్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జంక్షన్ విద్యుత్ సబ్ డివిజన్ డీఈఈ బి.శ్రీనివాసరావు శనివారం ప్రకటనలో తెలిపారు. స్థానిక విజయవాడ రోడ్డులోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలు వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

మొక్కలు నాటి సంరక్షణ చేపట్టాలి

ఉయ్యూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ, వాతావరణ సమతుల్యతకు ప్రతిఒక్కరు మొక్కలునాటి వాటి సంరక్షణ బాధ్యతగా చేపట్టాలని పలువురు అన్నారు. స్వచ్ఛాతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మండవ జయదేవ్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ వాకర్స్ అసోసియేషన్, శ్రీశ్రీనివాసా విద్యాసంస్థల ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో కలసి పరిసరాలు శుభ్ర పరచి మొక్కలు నాటారు. ముఖ్య అతిధి ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణ మాట్లాడుతూ మొక్కలు నాటి పెంచడం అందరి బాధ్యత అన్నారు. ఉయ్యూరు పరిసర ప్రాంతాల్లో 500 మొక్కలు నాటాలన్నది లక్ష్యంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు సుబ్రమణ్యం అన్నారు.

ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి పారదర్శకంగా పనిచేయండి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



నియామకపత్రాన్ని కొండా నాగేశ్వరరావుకు అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, తుమ్మలపల్లి హరికృష్ణ

కంకిపాడు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పని చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ప్రభుత్వం నియమించిన కొండా నాగేశ్వరరావుకు శనివారం ఆయన నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసి తద్వారా ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరగకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, చిట్టూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సిద్దిక్‌నగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న శంకరబాబు

పేద వర్గాలకు అండగా కూటమి ప్రభుత్వం

కానూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్దిక్ నగర్, తులసీనగర్ ప్రాంతాల్లో సుపరిపాలన తొల అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ శ్రేణులతో కలిసి ఆయన ఇంటింటికి తిరిగి ఏడాది కాలంలో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా నిలుస్తోందని, ప్రభుత్వ పథకాలు సక్రమంగా వినియోగించుకోవాలని శంకరబాబు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఇమామ్, రఫీ రెహమాన్, పువ్వాడ రమేష్, బచ్చన్, అబిద్, రియాజ్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : కూటమి పాలనలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని సర్పంచ్ పిల్లా అనిత అన్నారు. వీరవల్లిలో శనివారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్ర మంలో జిల్లా తెలుగు యువత నాయకుడు మండాది రవీంద్ర, ఉపసర్పంచ్ లంక అజయ్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులను వివరిస్తూ సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పాలకవర్గ సభ్యుడు పిల్లా రామారావు పాల్గొన్నారు.

గ్యాస్ బండలు ఉచితంగా ఇవ్వాలి

గన్నవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట చేస్తున్న కార్మికులకు ఉచితంగా గ్యాస్ బండలు సరఫరా చేయాలని ఏపీ మధ్యాహ్నం భోజన పథకం వంట ఏజెన్సీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గండికోట సమ్మక్క డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సంఘ కార్యాలయంలో వంట ఏజెన్సీ కార్మిక సంఘం మండల మహాసభ సంఘ అధ్యక్షురాలు కుమారి అధ్యక్షతన జరిగింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కళ్లం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, నిత్యవసర వస్తువుల ధరలు వంట ఏజెన్సీలకు భారంగా మారుతుందన్నారు.

● వంట ఏజెన్సీ కార్మిక సంఘం మండల అధ్యక్షురాలిగా జి. సుందరమ్మ, ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం లలిత కుమారి, కోశాధికారిగా సుబ్రహ్మణ్యం, మరో 10 మందితో కమిటీ ఏర్పడింది. అదేవిధంగా స్కూలు పారిశుధ్య కార్మికుల అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఎన్. పద్మకుమారి, కార్యదర్శిగా మల్లేశ్వరి, కోశాధికారిగా వేమూరి సుజాత, మరో ఐదుగురితో కమిటీ ఎన్నికయింది.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 123, 134
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 520	

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

పామర్రు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం కోర్సుల్లో చేరేందుకు 2025-26 సంవత్సరానికి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది నుంచి నూతన సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానంలో డిగ్రీ కోర్సుల అడ్మిషన్లను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ల పద్ధతిలో పొందొచ్చని సూచించారు. హెల్ప్ లైన్ నెంబరు 94940 55776కు ఫోన్ చేయొచ్చని లేదా అడ్మిషన్ల కమిటీ కన్వీనర్ కేఆర్జీ శేషకుమార్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.



అలీనఖీపాలెంలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

బడుగుల అభ్యున్నతే ధ్యేయం

తొలి అడుగులో ఎమ్మెల్యే కుమార్‌రాజా

పమిడిముక్కల, జూలై 19(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీల అభ్యున్నతే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం అలీనఖీపాలెంలో ఆయన పర్యటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు ఇంటింటా ప్రచారం చేసి ప్రభుత్వానికి అండగా నిలవాలని ప్రజలను కోరారు. చేర గుడి- అలీనఖీపాలెం రోడ్డు గోతులమయంగా ఉందని వాహనాలు నడిపేందుకు ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే మరమ్మతులు చేయిస్తామని, తర్వాత రోడ్డు వేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, మీర్జా బస్‌అలీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ప్రజలకు అన్ని శుభాలే : వెనిగండ్ల రాము

గుడివాడ: కూటమి పాలనలో ప్రజలకు అన్ని శుభాలే జరిగాయని, ప్రతి పేద వాడికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం 4, 5, 27 వార్డుల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ హామీలు ఇప్పటికే అమలు చేశామని, మిగిలిన హామీలను త్వరలోనే అమలు చేస్తామని తెలిపారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, నాయకులు రాంబాబు, లింగం ప్రసాద్, సాంబశివరావు, ఉమా, జగన్మోహనరావు, పులవర్తి డేవిడ్, కొడాలి రాజా, బాలసాని భవానిశంకర్, కొడాలి అనీల్, బాలు, తుమ్మల సుబ్బారావు, పొట్లూరి శ్రీవెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



గుడివాడలో ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు



నిరసన తెలుపుతున్న ట్యాక్సీ ఓనర్స్ అసోసియేషన్, లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు

ఏటీఎస్‌ను గుడివాడలోనే కొనసాగించాలి

● ది గుడివాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్

గుడివాడ, జూలై 19(ఆంధ్రజ్యోతి): గుడివాడలో 67వేలకు పైగా వాహనాలు ప్రతి ఏటా బ్రేక్ చేయించుకోవలసి ఉందని, దూరంగా ఉన్న మచిలీపట్నంలోని ఏటీఎస్ సెంటర్‌కు వెళ్లాలంటే ఆర్థికంగా నష్టపోతారని ది గుడివాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అడుసుమిల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఏటీఎస్‌ను గుడివాడలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ శనివారం గౌరీశంకరపురంలోని ట్యాక్సీ స్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. పాత పద్ధతిలో గుడివాడలోనే బ్రేక్ చేయించుకునే వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి గోళ్ల శివ, అద్దాల నాని, శ్రీధర్, ఆర్.ప్రసాద్, మణికంఠ, దుర్గరావు, గోపాలరావు, వై.ప్రసాద్, ట్యాక్సీ యజమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం

గుడివాడ, జూలై 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మౌలిక వసతులు, మంచినీటి సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లలో నీటి సౌకర్యం లేదన్నారు. తల్లికి వందనం అందరికి ఇస్తామని హామీ ఇచ్చి కొందరికి నిలుపుదల చేశారని అన్నారు. పట్టణంలో హైస్కూళ్లను అప్‌గ్రేడ్ చేసి జూనియర్ కళాశాలలుగా మార్చారని, కనీసం అధ్యాపకులను నియమించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కార్యదర్శి నాగేంద్రబాబు, జిల్లా సహాయ కార్యదర్శి హారిక పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి దేవస్థానానికి రూ.10,116 విరాళం

బంటుమిల్లి రోడ్డులోని గంగాపార్వతీ సమేత భీమేశ్వరస్వామి దేవస్థానంలో ఐదంతస్తుల రాజగోపుర నిర్మాణానికి పట్టణానికి చెందిన కె.దుర్యోధనరావు రూ.10,116 శనివారం ఈవో కందుల వేణుగోపాలరావుకు విరాళంగా అందజేశారు. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



గుడివాడ మండల కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో విష్ణుప్రసాద్, సిబ్బంది



పామర్రులో ఉచితంగా క్లాత్ సంచులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ కస్తూరి, అధికారులు



తోట్లవల్లూరులో జరిగిన ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు

స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో ప్రజాప్రతినిధులు, అధికారులు

పామర్రు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వినియోగంతో అనేక అనర్థాలు కలుగుతాయని, ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనలో ప్రజలంతా భాగస్వాములవ్వాలని డిప్యూటీ ఎంపీడీవో గుత్తికొండ కృష్ణకిషోర్ పిలుపునిచ్చారు. పామర్రు ఒకటో గ్రామ సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వస్త్ర సంచులను పంచాయతీ తరఫున ఉచితంగా పంపిణీ చేశారు. సర్పంచ్ కేతవతు కస్తూరి, కార్యదర్శి అబ్దుల్ సలీం, శానిటరీ అధికారి సుధాకర్, ఐదు సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: ప్లాస్టిక్‌ను వినియోగించొద్దని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో విష్ణుప్రసాద్ ప్రతిజ్ఞ చేయించారు. డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, అధికారులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: ప్లాస్టిక్ వినియోగం ఎన్నో అనర్థాలకు దారి తీస్తుందని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు ప్రజలందరు ముందుకు రావాలని తోట్లవల్లూరు పంచాయతీ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి వ్యాపార దుకాణాలకు వెళ్లి ప్లాస్టిక్ కవర్లను వినియోగించొద్దని వ్యాపారులకు సూచించారు. డీఎల్డీవో రాజేష్, సర్పంచ్ పెనుమత్స రాధిక, ఎంపీడీవో రవికాంత్, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరమ్మ, ఎంఈవో-1 జి.వెంకటేశ్వరరావు, ఎంఈవో-2 సురేష్, కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు. అనంతరం పారిశుధ్య సిబ్బందిని సత్కరించారు.

స్మార్ట్‌మీటర్లను అడ్డుకుంటాం

● బావాజీమఠం కాలనీ అభివృద్ధి కమిటీ

గుడివాడ, జూలై 19(ఆంధ్రజ్యోతి): పేదలు ఎక్కువగా నివసించే బావాజీమఠం కాలనీలో స్మార్ట్‌మీటర్లను బిగించడానికి తాము అంగీకరించబోమని కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంజరపు పాపారావు అన్నారు. శనివారం బావాజీమఠం కాలనీలోని మెయిన్ రోడ్డు సెంటర్‌లో కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మనుషులు లేని సమయంలో ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు బిగించడం దారుణమన్నారు. ప్రభుత్వ కాలనీల తరహాలోనే ఒక్క రూపాయికే తమ ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయించుకునే వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి షేక్ రమీజా, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు, శివకుమారి, హిమబిందు, భవాని, జ్యోతి, పవన్, ఉషారాణి, హేమ, ధనలక్ష్మి పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలి

న్యూఇందిరానగర్ కాలనీలో స్మార్ట్‌మీటర్లు బిగించడాన్ని నిలుపుదల చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఇందిరానగర్‌కాలనీలో ఇంటింటికీ వెళ్లి ఆయన కరపత్రాలను పంపిణీచేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇళ్ల యజమానులను బెదిరించి స్మార్ట్‌మీటర్లను బిగించడం దారుణమన్నారు. నాయకులు రేపాని కొండ, వెంకటేశ్వరరావు, సీహెచ్ శివ పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న బావాజీమఠం కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు



పుల్లేరు కాల్వలో గుర్రపుడెక్క తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న ఇరిగేషన్ అధికారులు

గుర్రపుడెక్క తొలగింపు

గుడ్లవల్లేరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): పుల్లేరు ప్రధాన కాల్వలో రైల్వేబ్రిడ్జ్ వద్ద మేటవేసుకున్న గుర్రపుడెక్కను శనివారం యంత్రాల సాయంతో తొలగించారు. రైల్వే బ్రిడ్జ్ పిల్లర్ల వద్ద 200 మీటర్ల మేర గుర్రపుడెక్క మేటవేయడంతో దిగువకు నీటి ప్రవాహం తగ్గుతోంది. పనులను గుడ్లవల్లేరు ఇరిగేషన్ డివిజన్ డీఈ సరిపల్లి శ్రీను, జేఈ వల్లూరు లక్ష్మీతులసి, లాక్‌సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

కాలువ గండి పూడ్చివేత

గుడ్లవల్లేరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): వేమవరం కాలువకు ఇటీవల గండిపడగా ఆ గండిని శనివారం పూడ్చారు. పనులను భారతీయ భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు మేసాని విజయభాస్కర్ ఆధ్వర్యంలో జిల్లా భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు ఆళ్ళ దుర్గామల్లేశ్వరరావు, కార్యదర్శి జీవీ కాసులు, జేఈ లక్ష్మీతులసి పరిశీలించారు.

వర్షపునీటిలో వరి నాట్లు

పమిడిముక్కల, జూలై 19(ఆంధ్రజ్యోతి): రెండురోజులు కురిసిన భారీ వర్షాలకు తాడంకి, గోపువానిపాలెం పరిధిలో వందలాది ఎకరాల్లో వరినాట్లు నీటమునిగాయి. మురుగునీరు పో యేమార్గం లేకపోవడంతో అధిక వర్షం, కాల్వల ద్వారా వచ్చే నీటి కారణంగా వరి నాట్లు ముంపు బారినపడ్డాయి. ఉయ్యూరు, గురజాడతో పాటు ఎగువనుంచి వచ్చే నీరు దిగువకకు పోయే మార్గంలేక, కనుమూరు పరిధిలో మురుగునీటి కాల్వల తూములు మూసివేయడం వల్ల ఈ దుస్థితి దాపురించిందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.

పంట కాలువలో పూడికతీత



కూచిపూడి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా చొరవతో నిమ్మకూరు చానల్ పరిధిలోని చినముత్తేవి చక్రధర కాలనీ సమీపంలో పంట కాలువ పూడికతీత పనులు చేపట్టారు. కాలువ పూడుకుపోవటం వల్ల దిగువ పొలాలకు సాగునీరు అందక ఇబ్బంది పడుతున్నామని చినముత్తేవి గ్రామానికి చెందిన పలువురు రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కారానికి కృషి చేయాలని నీటి సంఘం జిల్లా వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్‌కు సూచించారు. శనివారం పూడికతీత పనులు చేపట్టారు. చినముత్తేవి రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.



స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో-2 బాలాజీ

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించండి

గుడివాడ రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంఈవో-2 బాలాజీ సూచించారు. శనివారం ఎస్పీఎస్ పాఠశాలలో ఎంఈవో ఆధ్వర్యంలో మోటూరు, చౌటపల్లి, ఎస్పీఎస్, ఏజీకే పాఠశాలల ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతుల్లో ఎంఈవో మాట్లాడారు.

అనుమతులు లేకుండా గుడివాడలో కార్యకర్తల సమావేశం

పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించిన గొర్ల శ్రీను అరెస్టు

గుడివాడ, జూలై 19(ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా సమావేశం ఏర్పాటు చేసి, పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వైసీపీ గుడివాడ పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీనును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గుడివాడలోని అరవపేటలోని వైసీపీ పట్టణ వింగ్ అధ్యక్షుడు అడబాల అప్పారావు స్థలంలో గొర్ల శ్రీను అధ్యక్షతన కార్యకర్తల సమావేశాన్ని శనివారం ఏర్పాటు చేశారు. సమావేశానికి వచ్చిన వారు తమ ద్విచక్రవాహనాలను అడ్డదిడ్డంగా నిలపడంతో రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోయింది. అనుమతులు లేకపోవడంతో పోలీసులు అడ్డుకున్నారు. పట్టణంలో 30యాక్టు అమలులో ఉందని, సమావేశాన్ని ఆపాలని వన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్, రూరల్ సీఐ ఎస్.ఎల్.ఆర్.సోమేశ్వరరావు కోరారు. పోలీసులు ఆదేశాలను బేఖాతరు చేయడమేకాకుండా గొర్ల శ్రీను పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించి, ఎదురు దాడికి దిగారు. దీంతో పోలీసులు అతనిని అరెస్టు చేశారు. ఎస్సైలు పి.గౌతమ్‌కుమార్, పూడినాగరాజు, సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

● చంద్రాల కార్యదర్శికి గ్రామస్థుల వినతి

గుడ్లవల్లేరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): చంద్రాల పంచాయతీ పరిధిలోని సింగలూరు గ్రామానికి చెందిన తాగునీటి చెరువుకు నీరు పెట్టే పంట కాల్వ సమస్య పరిష్కరించాలని, చెరువును పరిరక్షించాలని నూతన పంచాయతీ కార్యదర్శి రాజేంద్రకు గ్రామస్థులు శనివారం వినతిపత్రం అందచేశారు. గుడివాడ మునిసిపాలిటీకి వచ్చిన కలెక్టరు బాలాజీని సర్పంచ్ కాలిశెట్టి అర్జునరావు, డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామస్థులు కలిసి వినతి పత్రాన్ని అందించి, సమస్యను పరిష్కరించాలని కోరారు.

కేఈబీ కెనాల్లో గుర్తుతెలియని మహిళ మృతదేహం

తోట్లవల్లూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): రొయ్యూరు వద్ద కేఈబీ కెనాల్లో శనివారం గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించామని ఎస్సై సీహెచ్ అవినాష్ తెలిపారు. మృతదేహం బాగా కుళ్లిపోయి ఉందని, వయస్సు 60 నుంచి 65 ఏళ్ల మధ్య ఉంటుందని, శరీరంపై ఆకుపచ్చ రంగు చీర, ఆకుపచ్చ రంగు జాకెట్ ఉన్నాయని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.



కూచిపూడిలో రక్తదాన శిబిరం

కూచిపూడి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం కూచిపూడిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. తహసీల్దార్ కె.మస్తాన్ శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ శివప్రసాద్ పర్యవేక్షణలో యువతీ, యువకులు రక్తదానం చేశారు. మొవ్వ ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, మొవ్వ సబ్ బ్రాంచ్ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, రెడ్‌క్రాస్ ట్రెజరర్ కొండపల్లి రాంబాలాజీ, మేనేజింగ్ కమిటీ మెంబర్ కొత్తగుండు రమేష్, జిల్లా కార్యదర్శి భవిరి శంకర్‌నాథ్, డిప్యూటీ తహసీల్దార్ రఘురామ్, ఆర్ఐ విజయదుర్గా, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

500 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

గుడ్లవల్లేరు, జూలై 19(ఆంధ్ర జ్యోతి): పెంజంద్ర గ్రామంలోని ఇందిరా మహల్‌లో బొప్పన శరత్‌గోపాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్, బొప్పన ఝాన్సీరాణి శనివారం ప్రారంభించారు. శరత్‌కుమార్ జ్ఞాపకార్థం స్వగ్రామమైన పెంజంద్రలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 500 మంది విద్యార్థులకు గుంటూరు శంకర నేత్రాలయ వైద్య బృందంతో పరీక్షలు చేయించారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, క్రీడా కిట్లు పంపిణీ చేశారు. బొప్పన తారాచంద్, కుసుమ, నాదెళ్ల కావ్య, సందీప్ పాల్గొన్నారు. ఆదివారం నిర్వహించనున్న మెగా వైద్య శిబిరాన్ని చుట్టుపక్కల ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని తారాచంద్ విజ్ఞప్తి చేశారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న బొప్పన ఝాన్సీరాణి

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.ల్లో)
బ్రాయిలర్ బర్డ్	115, 123, 134
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 520

మరిన్ని హాస్య నాటికలు రావాలి

● ప్రపంచ రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు

మచిలీపట్నం టౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఒత్తిళ్లతో జీవితాన్ని సాగిస్తున్న ప్రస్తుత తరుణంలో వాటి నుంచి బయటపడడానికి హాస్యనాటికలు మరిన్ని రావాలని ప్రపంచ రచయితల సంఘ అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు ఆకాంక్షించారు. భావతరంగిణి ఆధ్వర్యంలో మహతి కళావేదికపై శనివారం సాయంత్రం హాస్యలఘునాటికల ప్రదర్శన జరిగింది. సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సరస్వతి కళాసమితి అధ్యక్షుడు సి.శేషాచార్యులు(అప్పాజీ), సిరికవి డాక్టర్ చింతలపాటి మురళీకృష్ణ, డాక్టర్ బి.ధన్వంతరీ ఆచార్య, జి.రామబ్రహ్మం, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ పాల్గొన్నారు.



కప్పలదొడ్డి హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, బందరు రైతుబజారు వద్ద ప్రతిజ్ఞ చేయిస్తున్న మార్కెట్‌యార్డు చైర్మన్ కుంచె నాని, వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా కార్యాలయంలో స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ అవనిగడ్డలో ప్రతిజ్ఞ చేస్తున్న జూనియర్ కళాశాల విద్యార్థులు, పెడనలో ర్యాలీ చేస్తున్న మునిసిపల్ అధికారులు, సిబ్బంది

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

● స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పిలుపు

గూడూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): భావితరాల భవిష్యత్ కోసం ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని, పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ప్రజలకు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం కప్పలదొడ్డి హైస్కూల్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే మొక్కలు నాటారు. డీసీ చైర్మన్ పోతన స్వామి, మాజీ సర్పంచ్ కట్టా మునీశ్వరరావు, మండల పరిషత్ పర్యవేక్షణాధికారి రామకృష్ణ, డీవైఈవో శేఖర్‌సింగ్, ఎంఈవో సుబ్రహ్మణ్యం, ఈవో పీఆర్డీ రాజేశ్వరి, హెచ్‌ఎం సుధారాణి, విద్యాకమిటీ చైర్మన్ శివరామకృష్ణ పాల్గొన్నారు. ఆకులమన్నాడులో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ ఎండీ రఫీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పేరుతో ఎంపీపీ స్కూల్ వద్ద సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, ఉపాధ్యాయులు స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు.

పెడనలో ర్యాలీ..

పెడన: భట్ల జ్ఞానకోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధికారులు, ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులతో పురపాలక సంఘ కార్యాలయం నుంచి బంటుమిల్లి రోడ్డు సెంటర్ వరకు స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. షాపుల యజమానులను కలిసి ప్లాస్టిక్ నిషేధించినందున క్యారీబ్యాగులు, గ్లాసులు విక్రయించవద్దని సూచించారు. కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి, వార్డు ఎన్విరాన్‌మెంట్ అండ్ శానిటరీ సెక్రటరీలు, మునిసిపల్ కార్యాలయ ఉద్యోగులు, శానిటరీ వర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ర్యాలీ

అవనిగడ్డ/అవనిగడ్డ రూరల్: పర్యావరణానికి హాని చేసే సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని వెంటనే నిలిపివేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నినదించారు. అవనిగడ్డలో ప్లాస్టిక్ నిర్మూలనపై విద్యార్థులు ప్రతిజ్ఞ చేసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ దొరబాబు, అధ్యాపకులు నరసింహారావు, దుడ్డు కృష్ణారావు, సురేష్, నాగరాజు, దిలీప్, సాయి పాల్గొన్నారు. అంతకు ముందు పంచాయతీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు, సిబ్బంది ప్లాస్టిక్ వినియోగాన్ని మానేయాలని దుకాణదారులకు అవగాహన కల్పించారు. పులిగడ్డ పంచాయతీ పరిధిలో సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ ప్రతీ దుకాణానికి వెళ్లి ప్లాస్టిక్ వాడకాన్ని మానేయాలని యజమానులకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి బి.అనిత, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల మండలంలో..

ఘంటసాల: ప్లాస్టిక్ వాడకాన్ని మానేయాలని ఘంటసాల, ఘంటసాలపాలెం, తెలుగురావుపాలెం, చిట్టూర్పు, చినకళ్లేపల్లి గ్రామాల్లో సర్పంచ్‌లు గుత్తికొండ రామారావు, రాచూరి ప్రసాద్‌బాబు, గూడపాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శులు సుధాకర్, అబ్దుల్ నయీం, బోలెం అర్జునరావు, జయలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు షాపుల వద్దకు వెళ్లి వ్యాపారులకు అవగాహన కల్పించారు. చిట్టూర్పు, చినకళ్లేపల్లి గ్రామాల్లో గ్రామస్థులకు చేతి సంచులను అందజేశారు. పర్యావరణానికి పెనుభూతంగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని పంచాయతీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జడ్పీ హైస్కూల్‌లో మానవహారం నిర్వహించారు. సర్పంచ్ ముప్పనేని రవిప్రసాద్, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారణకు ప్రజల సహకారం అవసరం

మచిలీపట్నం టౌన్: ప్లాస్టిక్ నివారణకు ప్రజల సహకారం అవసరమని మార్కెట్ యార్డు చైర్మన్ కుంచె నాని అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా 45వ డివిజన్ రైతు బజారులో టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి వీవీ ఫణికుమార్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో కలిసి ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. రైతుబజారు గేటు వద్ద ప్రతిజ్ఞ చేయించారు. శానిటేషన్ వర్కర్లను సన్మానించారు. రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్ బలిచక్రవర్తి పాల్గొన్నారు. కానూరు పంచాయతీలోని జడ్పీ హైస్కూల్‌లో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఉద్యోగులతో తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ ప్రతిజ్ఞ చేయించారు. దివి మహేష్, వెంకటేశ్వరరావు, బొమ్మిడి ఏడుకొండలు, పెద వెంకన్న, రాజేష్ పాల్గొన్నారు.

జిల్లా ఆరోగ్యశాఖ కార్యాలయంలో...

ఆరోగ్యశాఖ జిల్లా కార్యాలయంలో డీఎంహెచ్‌వో శర్మిష్ఠ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయ సిబ్బందితో ఆమె ప్రతిజ్ఞ చేయించారు.

మోపిదేవి దేవస్థానం అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నాం

● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్



ఆర్వో ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ దంపతులు, దివీస్ ప్రతినిధులు, దేవస్థానం అధికారులు

మోపిదేవి, జూలై 19(ఆంధ్రజ్యోతి): లక్షలాది భక్తులు సందర్శిస్తున్న మోపిదేవి దేవస్థానం అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. శనివారం దేవస్థానం కోనేరు ప్రాంగణంలోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో దివీస్ లేబరేటరీ లిమిటెడ్ ఎండీ దివి మురళీకృష్ణ ఆధ్వర్యంలో రూ.32 లక్షలతో నిర్మించిన రెండు ఆర్వో వాటర్ ప్లాంట్లను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ - విజయలక్ష్మి దంపతులు ప్రారంభించారు. దివీస్ ల్యాబ్ వారు దేవస్థానం భక్తుల కోసం కాటేజ్ నిర్మించాలని ఆయన కోరారు. దేవస్థానం ఆవరణలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమం టీటీడీ మండపంలోకి మార్చి, ఇక్కడ నిర్వహిస్తున్న అన్నప్రాశన, అక్షరాభ్యాసం, పాల పొంగళ్లు, చెవులు కుట్టే సేవలను దేవస్థానం ప్రాంగణంలోకి మార్చుతామని తెలిపారు. కోనేరు ప్రాంగణంలో వసతి గదుల కాంప్లెక్స్, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి కావచ్చిందన్నారు. భక్తుల కోసం టాయిలెట్లు నిర్మించనున్నట్లు తెలిపారు. దివీస్ ల్యాబ్ ప్రతినిధులు నగేష్, శ్రీనివాసరావును దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో వేదపండితులు సత్కరించారు. ఆశీర్వచనం అందించి స్వామి చిత్రపటం బహూకరించారు.



రాయవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్

పేదల సంక్షేమమే ధ్యేయం

గూడూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ తెలిపారు. శనివారం రాయవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి కరపత్రాలు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పోతన స్వామి, బీజేపీ మండల అధ్యక్షులు కోలపల్లి రజని, కూటమి నాయకులు మునగాల భాస్కర్, భవనారాయణ, చిన్నం వెంకటేశ్వరరావు, మునగాల మార్కండేయులు, గోపి నాగబాబు, ఎన్ఏ బేగ్, శ్రీను, బాసంశెట్టి శ్రీను, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

అవనిగడ్డ 4వ వార్డులో..

అవనిగడ్డ: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని 4వ వార్డు బీసీ కాలనీలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సాధించిన ప్రగతిని వివరించారు. టీడీపీ నాయకులు కర్రా సుధాకర్, పరుచూరి దుర్గా ప్రసాద్, బండే కనకదుర్గ, నడకుదుటి కృష్ణ, బచ్చు కృష్ణకుమారి పాల్గొన్నారు.



కొడాలిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు

కొడాలిలో..

ఘంటసాల: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని కొడాలిలో టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. గుత్తికొండ వరప్రసాద్, కంఠమనేని రాజ్‌గోపాల్, పరుచూరి శ్రీనివాసరావు వీరంకి నాగరాజు, కొడాలి శివాజీ, కొడాలి లక్ష్మణ్, వీరంకి రామకృష్ణ పాల్గొన్నారు.

సత్తా ఉంటే డంపింగ్ యార్డును తరలించండి

● ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు వైసీపీ శ్రేణుల సవాల్

అవనిగడ్డ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు సత్తా ఉంటే డంపింగ్ యార్డును వేరే చోటికి తరలించాక విమర్శలు చేయాలని వైసీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తంచేశాయి. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుపై ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై నియోజకవర్గ శ్రేణులు శనివారం స్పందించాయి. అవనిగడ్డ డంపింగ్ యార్డు వద్ద నాయకులు ఆందోళన నిర్వహించారు. అసలైన పాచిపోగు అంటే అవనిగడ్డ డంపింగ్ యార్డు అని, దానిని అభివృద్ధి చేశాక మాట్లాడాలని బుద్ధప్రసాద్‌కు వారు సవాల్ విసిరారు. ఏడాదిలో నియోజకవర్గంలో రూ.825 కోట్ల అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రచారం చేయించుకుంటున్నారని, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి రూ.50 కోట్లు దాటదని వారు అన్నారు. నేతలు సింహాద్రి వెంకటేశ్వరరావు, నలుకుర్తి రమేష్, చింతలపూడి లక్ష్మీనారాయణ, చింతలపూడి బాలభాస్కరరావు, రేపల్లె శ్రీనివాసరావు, గాజుల జైగోపాల్, మద్ది వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పరీక్షా శిబిరం

చల్లపల్లి, జూలై 19(ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం క్లబ్ భవనంలో ఉచిత నేత్ర పరీక్షా శిబిరం నిర్వహించారు. లయన్స్‌క్లబ్ సభ్యుడు కంఠంనేని సుధాకరరావు పుట్టినరోజు సందర్భంగా కుమార్తె దీప్తిశ్రీ, కుమారుడు దిలీప్, మనుమడు రాగవ్ ఆర్థిక సహకారంతో శిబిరాన్ని ఏర్పాటుచేశారు. డాక్టర్ వెంకట్రావ్ 30 మందిని పరీక్షించి 8 మందిని ఐవోఎల్ ఆపరేషన్లకు గూడూరు సాయినేత్ర వైద్యాలయానికి తీసుకువెళ్లారు. ముమ్మనేని నాని, వరదా హరిగోపాల్, నర్రా సాయిబాబు శిబిరాన్ని పర్యవేక్షించారు.



అవనిగడ్డ బస్టాండ్ సెంటర్, చల్లపల్లి ప్రధాన సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

ఘనంగా కనపర్తి శ్రీనివాసరావు జన్మదినోత్సవం

అవనిగడ్డ/చల్లపల్లి/కోడూరు/నాగాయలంక, జూలై 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు శనివారం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. అవనిగడ్డ బస్టాండ్ సెంటర్‌లో పార్టీ నేతలు భారీ కేక్ కట్ చేశారు. కనపర్తి శ్రీనివాసరావు మరిన్ని పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, నేతలు బండే శ్రీనివాసరావు, విశ్వనాథపల్లి పాప, బండే కనకదుర్గ, పరుచూరి దుర్గా ప్రసాద్, కర్రా సుధాకర్, మేడికొండ విజయ్, మెగావత్ గోపి పాల్గొన్నారు. చల్లపల్లిలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏటీఎం సెంటరులో వేడుకలు నిర్వహించారు. నేతలు కేక్ కట్‌చేశారు. టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీటీసీలు మాలెంపాటి శ్రీనివాసరావు, పైడిపాముల స్వప్న, నేతలు షేక్ నబీషోరి, మోర్ల ప్రసాద్, కోట సత్యనారాయణ, మోర్ల శివ, షేక్ సిలార్, కోట పద్మావతి, పఠాన్ జిలాని, మేడికొండ రవిబాబు పాల్గొన్నారు. కోడూరులో పార్టీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయం వద్ద వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. నాయకులు పూతబోయిన శ్రీనివాసరావు, వేముల వేలాద్రి, గంటా గాంధీ, బండే వెంకటేష్, పిల్లి మల్లికార్జునరావు, కాగిత శివప్రసాద్, వేములపల్లి రాజేష్; బొలిశెట్టి విఠల్‌రావు, వేములపల్లి శ్రీకృష్ణ, మహ్మద్ ఇమ్రాన్, తాతా పోతురాజు తదితరులు పాల్గొన్నారు. నాగాయలంక ప్రధాన సెంటర్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు నేతృత్వంలో కేక్ కట్‌చేసి కనపర్తికి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు విరివిగా పాల్గొన్నారు.

మోటారు దొంగల అరెస్టు

కోడూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఆక్వా చెరువులపై మోటార్లు దొంగతనం చేస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం మోటార్లు దొంగిలించి అవనిగడ్డ తీసుకెళ్తున్న పిట్టలంక గ్రామానికి చెందిన శీలం కల్యాణ్‌రాయ్, బావిశెట్టివారిపాలెం గ్రామానికి చెందిన సింగంశెట్టి సాయి శ్రీనివాసరావును విశ్వనాథపల్లి వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్సై రాజేష్ శనివారం తెలిపారు. వారి వద్ద రూ.1,35,000 విలువైన 12 మోటార్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

వృద్ధురాలు కనిపించడం లేదని ఫిర్యాదు



చందన రాంప్రసాదం (ఫైల్)

కోడూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): కృష్ణాపురం గ్రామానికి చెందిన చందన రాంప్రసాదం(90) కనిపించటం లేదని ఆమె మనుమడు మనోజ్ ఫిర్యాదు చేశారని ఇన్‌చార్జి ఎస్సై రాజేష్ తెలిపారు. కృష్ణాపురంలో తమ నివాసం వద్ద ఉన్న రాంప్రసాదం శుక్రవారం రాత్రి నుంచి కనిపించటం లేదని, శనివారం కృష్ణాపురం చుట్టుపక్కల ప్రాంతాలంతా వెతికినప్పటికీ జాడ తెలియలేదని ఫిర్యాదులో పేర్కొన్నారని ఎస్సై తెలిపారు. వృద్ధురాలి సమాచారాన్ని 94408 58996కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు.

విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందజేత

అవనిగడ్డ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల క్రీడాభివృద్ధి కోసం రిటైర్డ్ పీడీ కోసూరు పూర్ణచంద్రరావు ప్రోద్బలంతో అవనిగడ్డకు చెందిన చింతా శ్రీనివాసరావు- రాధికల ఆర్థిక సహకారంతో విద్యార్థులకు క్రీడా సామాగ్రిని అందజేశారు. సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాస్‌ల చేతులమీదుగా ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నాగమల్లేశ్వరరావుకు రూ.10 వేల సామాగ్రిని అందజేశారు. పీడీ ఎం.ఉదయ్‌కుమార్, పాఠశాల విద్యా కుటుంబం పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి రూ.20 వేల విరాళం

పెడన, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గోశాల నిర్మాణానికి మద్దంశెట్టి నాగమల్లేశ్వరరావు, శ్యామలాదేవి దంపతులు రూ.20వేల విరాళం ఇచ్చారు. ఈ విరాళాన్ని ఆ దంపతులు శనివారం హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు నాదెళ్ల కోటేశ్వరరావుకు అందజేశారు.

శాకంబరిగా కన్యకా పరమేశ్వరి



పెడన, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో శనివారం అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో అమ్మవారిని కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మామిడి ప్రసాద్, కొల్లూరి రాధాకృష్ణ, బోగినపల్లి శ్యామ్‌ప్రసాద్, కొమ్మూరి విజయదుర్గ, తమ్మన లక్ష్మీతాయారు పాల్గొన్నారు.

మచిలీపట్నం యోగా క్రీడాకారుల ప్రతిభ



జిల్లా స్థాయి యోగా పోటీల్లో పతకాలు సాధించిన మచిలీపట్నం క్రీడాకారులు

మచిలీపట్నం టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు గండిగుంట దత్తాశ్రమంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో ఆరుగురు యోగా క్రీడాకారులు పతకాలు సాధించారు. నలుగురు బంగారు పతకాలు, ఒకరు రజత పతకం గెలుచుకోగా, మరొకరు కాంస్య పతకాలు సాధించారు.

పతకాలు సాధించింది వీరే..

హ్యాండ్ బ్యాలెన్సింగ్‌లో శీలం రమేష్ ట్విస్టింగ్ ఆసనాస్‌లో మద్దాల చింతయ్య, ఫార్వర్డ్ బెండింగ్‌లో కుంభం రేవతి, ట్రెడిషనల్, ఫార్వర్డ్ బెండింగ్‌లో ఎం.నాగసుభాషి సాయి బంగారు పతకం సాధించారు. ట్రెడిషనల్‌లో టీకే మల్లికార్జునుడు రజత పతకం, ఫార్వర్డ్ బెండింగ్‌లో బి.క్రాంతికుమార్ కాంస్య పతకం కైవసం చేసుకున్నారు.



కనకదుర్గమ్మకు సమర్పించేందుకు సారె తీసుకెళుతున్న భక్తులు

కనకదుర్గమ్మకు ఆషాఢ సారె

అవనిగడ్డ రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆషాఢ మాసం సందర్భంగా గ్రామ దేవతలకు సారె సమర్పించారు. అవనిగడ్డ సబ్ డివిజన్ నుచి కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ మండలాల్లోని 12 గ్రామాల నుంచి మొత్తం 240 మంది భక్తులు విజయవాడ కనకదుర్గమ్మకు సమర్పించేందుకు సారె తీసుకెళ్లారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా ధర్మపరిషత్ నేతలు జయశంకర్, నగరాజకుమారి, రామన్న, నాంచారమ్మ పాల్గొన్నారు.

కోట మల్లయ్య మృతి బీజేపీకి తీరనిలోటు

పెడన, జూలై 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నాయకుడు బళ్ల కోట మల్లయ్య మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పుప్పాల రామాంజనేయులు అన్నారు. పట్టణానికి చెందిన సీనియర్ కోట మల్లయ్య శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. శనివారం ఉదయం బీజేపీ నాయకులు కోట మల్లయ్య భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి నివాళులర్పించారు. నాయకులు పత్తిపాటి వెంకటరమణ, కట్టా జ్యోతీశ్వరరావు, కొల్లూరి రాధాకృష్ణగుప్తా, పులి వెంకటేశ్వరరావు, లంబోదరరావు తదితరులు పాల్గొన్నారు. కోటమల్లయ్య రంగస్థల కళాకారుడు కావడంతో ఆయన మృతి పట్ల ప్రముఖ నాటక సంస్థ కళావేదిక గౌరవాధ్యక్షుడు బొడ్డు వేణుగోపాలరావు, అధ్యక్షుడు యక్కల నాగేశ్వరరావు తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.